క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యుత్ మరమత్తుల కారణంగా ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదిబట్ల టౌన్ ఫీడర్ పరిధిలోని గృహ వినియోగదారులు, పరిశ్రమల, వాణిజ్య ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.55,500 పలికిన కొబ్బరికాయల వేలం

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించి శనివారం ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల వేలంపాట నిర్వహించారు. ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజుకుమార్‌రెడ్డి, ఈఓ మోహన్‌రావు సమక్షంలో వేలంపాట నిర్వహించగా గంగపురం మల్లేశ్ రూ.55,500కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి, ఆలయ అసిస్టెంట్ ఆంజనేయులు, మణిక, నరహరి, అర్చకులు రామాచారి, జంగయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

యాచారం: గ్యాస్ పొయ్యిపై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకుని గాయాలపాలైన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని నస్దిక్‌సింగారం గ్రామానికి చెందిన పోతురాజు సత్యమ్మ(70) తన ఇంట్లో శుక్రవారం రాత్రి గ్యాస్ పొయ్యిపై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. ఆమెను 108లో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం సత్యమ్మ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాటర్ ప్లాంట్ మరమ్మతులకు విరాళం



ప్రధానోపాధ్యాయుడికి చెక్కు అందజేస్తున్న వీరప్ప

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మినిరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు శనివారం పూర్వవిద్యార్థి గాండ్ల వీరప్ప విరాళం అందజేశారు. ఇటీవల మినిరల్ వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు సురేష్ ద్వారా పూర్వ విద్యార్థి, రిటైర్డ్ లైబ్రేరియన్ గాండ్ల వీరప్ప తెలుసుకున్నారు. వాటర్ ప్లాంట్ మరమ్మతులకు అయ్యే ఖర్చుకు సంబంధించి రూ.12,125 చెక్కును ప్రధానోపాధ్యాయుడికి వీరప్ప అందజేశారు. లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ శ్యాంప్రసాద్, రాంచందర్‌రావు, వాసుదేవరావు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 6న ప్రారంభమై 13న ముగియనున్నాయి సర్పంచ్ శ్రీశైలం, ఆలయ ఈఓ మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్, ఎంపీపీ నిర్మలను కలిసి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, ఈఓ మోహన్‌రావు, సత్యం, భిక్షపతి, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని రిషి టాలెంట్ హైస్కూల్‌లో శనివారం పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. రిషి టాలెంట్ స్కూల్‌లో చదివి ఉస్మానియా యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించిన నర్మద, నీట్‌లో ర్యాంకులు సాధించిన రాజేశ్, సిద్దార్థలను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో రిషి టాలెంట్ హైస్కూల్ అకాడమిక్ అడ్వయిజర్లు సత్యరాములు, రమేశ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

యాచారం: కొత్తపల్లి గ్రామంలో బొక్కల కంపెనీని మూసేయాలని గ్రామస్తులు చేపట్టిన నిరాహార దీక్ష శనివారంతో 31వ రోజుకు చేరింది. ఇప్పటికే అన్నిశాఖల అధికారులు బొక్కల కంపెనీని సందర్శించి కంపెనీని మూసేయాలంటూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు దీక్షలకు మద్దతు తెలిపారు. వెంటనే బొక్కల కంపెనీని మూసేయాలని డిమాండ్ చేశారు.



కల్యాణ వేడుకలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు



వేడుకకు హాజరైన భక్తులు

శ్రీనివాసస్వామి కల్యాణ ఉత్సవం

- రావిచేడ్‌లో కనులపండువగా భూదేవీ సమేత శ్రీనివాస కల్యాణం
- ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ భూదేవి సమేత శ్రీనివాస స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్యాండ్ మేళాలతో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి శ్రీ భూదేవి సమేత శ్రీనివాసస్వామివారికి అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త మంచినీటి వసతితో పాటు, భోజన వసతి ఏర్పాటు చేశారు.

ప్రముఖుల పూజలు...
స్వామివారి కల్యాణ వేడుకలకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్త, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి భారతమ్మ, ఆలయ అనువంశిక ధర్మకర్త రాంచందర్‌రావు, ఎంపీటీసీ గోపాల్, ఉప సర్పంచ్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీను, బాలకృష్ణ, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం

బీఆర్ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

తుర్కయంజాల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రగతినివేదన పాదయాత్రలో భాగంగా శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లిలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్నా అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలను వెంటనే మంజూరు చేయించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, బ్యాంకు డైరెక్టర్ స్వప్న, వార్డు అధ్యక్షుడు ఏనుగు అయ్యప్ప రెడ్డి, సీనియర్ నాయకులు సంపతీశ్వర్ రెడ్డి, లింగాల రవీందర్‌గౌడ్, మహిపాల్ రెడ్డి, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తదితరులు

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఐలయ్య

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని నవభారత్ కాలనీలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న పోచమ్మ దేవాలయ నిర్మాణానికి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య రూ.2.51 లక్షలను విరాళంగా అందించారు. శనివారం భూమి పూజ కార్యక్రమంలో ఆయన సతీసమేతంగా పాల్గొని ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మంగమ్మ, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఈద్గా, శ్మశానవాటికల వద్ద ప్రహరీల నిర్మాణం, మసీద్‌ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మైనార్టీ నేతలు శనివారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ విషయమై ఎమ్మెల్యే.. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో వీడియోకాల్‌లో మాట్లాడగా.. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్త, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు అర్షద్, మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు మహ్మద్ జావీద్, ఇమామ్ జహీరుద్దీన్, మైనార్టీ నాయకులు వాహబ్, మోయిన్, మహబూబ్‌అలీ, నిజాం, హిమాయత్‌అలీ, ఆమేర్, ఖాలేద్, ఆరీఫ్, మైనుద్దీన్ ఉన్నారు.



కడ్తాల్: ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మైనార్టీ నేతలు

రోడ్డు మరమ్మతులకు నిధుల మంజూరు..
తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధన–నిర్దవెళ్లి రోడ్డు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తన ఎమ్మెల్యే కోటా నుంచి రూ.5లక్షల నిధులు మంజూరు చేశారు. చంద్రధన–నిర్దవెళ్లికి వెళ్లే మట్టిరోడ్డు గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని స్థానిక నాయకులు ఇటీవల ఎమ్మెల్యేను కోరగా స్పందించిన ఎమ్మెల్యే రూ.5 లక్షలు మంజూర్ చేస్తున్నట్లు శనివారం తెలిపారు. నాయకులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారు

- ఎన్‌డీఏ సర్కార్‌పై ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి ఫైర్
- ఈనెల 6నుంచి బ్యాంకుల ఎదుట ఆందోళన కార్యక్రమాలకు పిలుపు

ఆమనగల్లు: కేంద్రంలోని మోదీ సర్కార్ కార్పొరేట్, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సామాన్యుల ప్రయోజనాలను విస్మరించి బడా వ్యాపారుల కోసం పనిచేస్తుందని ఆరోపించారు. ఒక వ్యక్తి మేలు కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ఆర్థికవ్యవస్థను చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. ఏఐసీసీ పిలుపుమేరకు అన్ని బ్లాక్ కేంద్రాల్లో ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఎల్ఐసీ కార్యాలయాలు, ఎస్‌బీఐ బ్యాంకుల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ఈనెల 6న ఆమనగల్లు ఎస్‌బీఐ ఎదుట భారీ ధర్నా కార్యక్రమం చేపడతామని వంశీచంద్‌రెడ్డి వెల్లడించారు. ధర్నా కార్యక్రమానికి అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ కార్యదర్శి అంజయ్య, కడ్తాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు జహంగీర్‌బాబా, సేవ్యానాయక్, శ్రీశైలం, అజీం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయండి..
కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన యాట నర్సింహ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నేనావత్ బీక్యానాయక్, కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన సభావట్ బీచ్యానాయక్, తలకొండపల్లి మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమితులైన గుజ్జుల మహేశ్‌కు శనివారం వారు నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, అంజయ్యగుప్త, అజీమ్, ఇమ్రాన్, మల్లేశ్‌గౌడ్, సత్యం, రాజేందర్ తదితరులు ఉన్నారు.

పాలకవర్గంపై ఆరోపణలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ

తుర్కయంజాల్: మున్సిపాలిటీ అభివృద్ధికి నిధుల కేటాయింపులో వివక్ష చూపించడమే కాకుండా పాలకవర్గంపైనే ఆరోపణలు చేయడం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ఎంతవరకు సమంజసం అని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లో ఆమె మాట్లాడుతూ.. ప్రగతి నివేదన యాత్రలో భాగంగా తొర్రూర్‌లో సభ ఏర్పాటు చేసి పాలకవర్గాన్ని విమర్శించడం దారుణం అన్నారు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శిలాఫలకం వేయించి ఏడాది పూర్తవుతున్నా పురపాలక సంఘం కార్యాలయ భవనం, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదని ప్రశ్నించారు. నాదర్‌గుల్ రోడ్డు పనులు సాగర్ రహదారి నుంచి ఎందుకు ప్రారంభించలేదని, రూ. 92 కోట్లతో పైప్‌లైన్ పనులను ఈ ఏడాది జనవరి వరకే అందుబాటులోకి తెస్తామని చెప్పి పాత పైప్‌లైన్‌లను ధ్వంసం చేయడంతో నేడు అనేక కాలనీల్లో నీటి సమస్య తలెత్తిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్‌రాజ్‌గౌడ్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు, కౌన్సిలర్ మంగమ్మ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, కౌన్సిలర్లు ఉదయశ్రీ, శివలింగంగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన బంగారుగడ్డ ఆగమ్మ ఇటీవల మృతి చెందింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా పడమటి తండాకు చెందిన చాప్లి అనారోగ్యంతో మృతి చెందింది. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 3000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో డాక్య, కృష్ణ, పాండు, రాజశేఖర్, జంగయ్య, అశోక్, గురువయ్య, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి చేయూత..
తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువతి కవిత వివాహానికి జెడ్పీటీసీ వెంకటేశ్ తన ఉప్పల ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం ట్రస్టు సభ్యులచే రూ.10,000 కవిత బంధువులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జ్యోతయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, వార్డు సభ్యుడు కోటేశ్వర్, శ్రీను, జంగయ్య, యాదయ్య, మల్లేశ్, వెంకటేశ్, కృష్ణయ్య, మల్లేష్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

మంచాల: మంచాల మండల పరిధిలోని ఆస్మత్‌పూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణానికి ×వీ ఆర్ వన్ ఫౌండేషన్ అధినేత కుకుడాల వెంకటేశ్వరరెడ్డి విరాళం అందించారు. భక్తులు పెద్దసంఖ్యలో విరాళాలు అందించాలని గ్రామ సర్పంచ్ హరిప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోళ్ల జగన్, ఎంపీటీసీ సభ్యులు లట్టుపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ

ఆమనగల్లు: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు అండగా ఉంటుందని తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ తెలిపారు. మాడ్గుల మండలం అందుగుల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ట్రస్టు ఆధ్వర్యంలో సమకూర్చిన స్పోర్ట్స్ డ్రెస్సులను శనివారం ఆయన పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 235 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. తలకొండపల్లి ఎంపీపీ నిర్మల, సర్పంచ్ జయలక్ష్మి, రాజు, నాయకులు హన్మాన్‌రాథోడ్, జగన్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీను, శేఖర్, మహేశ్, శ్రీశైలం, వెంకటరమణ, చంద్రమౌళి, శివ, యాదయ్య, రామాచారి, బిక్కు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి హైద్రాబాద్ గాంధీభవన్‌లో శనివారం ప్రభాకర్‌రెడ్డికి నియామకపత్రం అందజేశారు. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి గత దశాబ్దకాలంగా పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. ఆయన సేవలను గుర్తించి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు వంశీచంద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్య గుప్తా, సర్పంచ్ శ్రీశైలం, కల్వకుర్తి సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీం, అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రవీందర్‌యాదవ్, సేవాదల్ అధ్యక్షుడు దశరథం, యువజన అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, చెన్నకేశవులు, రామ్‌లక్షణ్, సత్యం, రమేష్, భిక్షపతి, ఆరీఫ్, గౌస్ వెంకటేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న వంశీచంద్‌రెడ్డి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాధవన్

అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్

కడ్తాల్: అవేర్ సంస్థ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ చైర్మన్ పీకేఎస్ మాధవన్ అన్నారు. మండల పరిధిలోని రావిచేడ్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయం వద్ద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో కేర్ ఆస్పత్రి, అంకిత ఆస్పత్రి, గ్లోబల్ హైకేర్ వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్, అశోక్‌రెడ్డి, రవి, సందీప్ ఆధ్వర్యంలో 680 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేసినట్లు అవేర్ సంస్థ మేనేజర్ వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ విఠలయ్యగౌడ్, ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, ఉప సర్పంచ్ వెంకటేశ్, మురళీమోహన్, పుట్టపాక రాజేంద్రరావు, క్రాంతి కిరణ్, వెంకట్‌రెడ్డి, స్థానిక నాయకులు బాలకృష్ణ, శ్రీను, వంశీ, పవన్, రవి తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

చిరబుడ్డీ ఎడ్యుకేషనల్ సొసైటీ

ఇబ్రహీంపట్నం రూరల్: పేద విద్యార్థుల చదువులకు చిరబుడ్డీ ఎడ్యుకేషనల్ సొసైటీ అండగా ఉంటుందని సీవీఆర్ కళాశాల వ్యవస్థాపక చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళ్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోషల్ అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం 9వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్టడీ మెటీరియల్ అందజేశారు. చైర్మన్‌ను శేరిగూడ పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, హెచ్ఓడీ లక్ష్మి, శేరిగూడ ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు దామోదర్ తదితరులు పాల్గొన్నారు .



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



రాఘవేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం..
తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ కల్కిదోనగుట్ట ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి పూల రథోత్సవ (చిన్నతేరు) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పట్టాభిరామ శర్మ స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై కూర్చుండబెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ్య కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తిశర్మ, నితిన్ శర్మ, ఆలయ ఫౌండరీ చైర్మన్ సిద్ధాంతి పట్టాభిర్మా శర్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్‌గా సంజన, కరెస్పాండెంట్‌గా అంజలి, కలెక్టర్‌గా స్మితసాయి, ఆర్డీఓగా భవానీ, డీఈఓగా సహస్ర, జాయింట్ కలెక్టర్‌గా అర్షద్, పాఠశాల చైర్మన్‌గా అఖిల్, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అల్లాజీగౌడ్, అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్ రెడ్డి, కరెస్పాండెంట్ సుజాత, డైరెక్టర్ సావిత్రి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌శర్మ, మల్లేశ్, శ్రీరాం, యాదయ్య, చలంరాము, స్వామి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు